క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

లైబ్రరీ విజ్ఞాన గని



లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

పాణ్యం: విద్యార్థులు లైబ్రరీతో స్నేహం చేయాలని, అదోక విజ్ఞాన గని అని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం పాణ్యం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. లైబ్రరీలో సుమారు 500 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సుమారు రూ. 80వేల విలువ గల ఈ పుస్తకాలను దాతల సహకారంతో సమకూర్చడం జరిగిందన్నారు. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లకు బదులు పుస్తకాలతో దోస్తీ చేస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభకరాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామన్, ఎంఈఓ కోటయ్య, హెచ్‌ఎం రాములు నాయక్ వెంకటేశ్వర్లు, ఫరిదా తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సత్కారం



దాతలను సన్మానిస్తున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విరాళం చేసిన దాతలకు సత్కారం లభించింది. శనివారం మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తమ వంతుగా గ్రామంలోని పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లను విరాళంగా అందజేశారు. దాతల సహాయానికి గౌరవంగా మండల విద్యాశాఖ అధికారి ఓంకార్ యాదవ్‌ల చేతుల మీదుగా శనివారం దాతలను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గాలితోనే ఆరోగ్యం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): స్వచ్ఛమైన గాలిని తీసుకోవడం వల్లే మనిషి ఆరోగ్యం బాగుంటుందని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణ ఆంధ్రా కార్యాక్రమంలో భాగంగా ' స్వచ్ఛమైన గాలి ' అనే అంశంపై జెడ్పీలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యం వల్ల ప్రజలు పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు అవసరమైన మార్గాలను అన్వేషించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రవాణా రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ వినియోగం, సైకిల్, నడక ద్వారా కాలుష్యాన్ని నివారించే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే స్వచ్ఛమైన గాలిని స్వీకరించే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించి ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, జెడ్పీ పరిపాలనాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే కార్యాక్రమానికి హాజరైన ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

పెండింగ్ కరువు భత్యాలను తక్షణమే చెల్లించాలి

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ కరువు భత్యాలను తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి డిమాండ్ చేశారు. శనివారం సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సుబ్బరాయుడు, శేఖర్, గోవింద్‌నాయక్, దేవదాస్, హుసేన్ మియా, ముర్తుజా వలి, ఎల్లనాగరాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

- ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ
- వైఎస్సార్‌సీపీ నాయకులతో కోట్ల హర్ష





పార్టీ నాయకులు, కార్యకర్తలు, సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: పేదలకు వైద్య విద్యను అందించాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై శనివారం కర్నూలులో నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కోట్ల హర్ష మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే సీఎం చంద్రబాబు వాటిని పూర్తి చేయలేక పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి సంతకాలు సేకరించాలని సూచించారు. రాబోయే కాలంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి పోరాటాలు చేసేందుకు నాయకులు, కార్యకర్తలంతా సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కూటమి పాలనలో అన్యాయం జరిగిన వారు, రాజకీయ వేధింపులకు గురైన వారు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని, ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్తకు జగనన్న అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కోడుమూరు, గూడూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, దస్తగిరి, ఇమ్మాన్యూల్, గోపాల్, పాండురంగన్న, లోకేష్, పార్టీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి డీలర్ క్రిష్టారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పోలకల్ ప్రభాకర్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం బాషా, బూత్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి తులసిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రమేష్‌నాయుడు, సోమశేఖరరెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, మాధవస్వామి, రామచంద్ర, దివాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సుందరం, సురేష్, భానుప్రకాష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా రాస్తే కేసులా?

సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై నిర్భయంగా కథనాలు రాస్తే కేసులు పెడతారా?, కూటమి ప్రభుత్వంలో పాత్రికేయులకు రక్షణ కొరవడింది. ఇటీవల కల్తీ మద్యంపై ప్రత్యేక కథనాలను సాక్షి దిన పత్రిక ప్రచురించిన నేపథ్యంలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు మరికొంత మంది పాత్రికేయులపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేయడమే గాక, బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలం గొంతును నొక్కేస్తున్నారు. – **రమేష్, సీపీఐ మండల కార్యదర్శి; రవీంద్రనాథ్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓర్వకల్లు**

నిధులు మంజూరు చేయాలి

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో నూతన షాదీఖానా నిర్మాణానికి, శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన ముస్లింలు కోరారు. శనివారం గ్రామ నాయకులు సురేష్‌రెడ్డి, నాగరాజులతో కలిసి ముస్లింలు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తడకనపల్లె సర్పంచ్ సహేరాబీ, బస్తిపాడు గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయండి



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితో సి.బెళగల్ మండల నాయకులు

సి.బెళగల్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసే కుట్రలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ తీరును ప్రజలకు తెలియజేసి, సంతకాల సేకరణ అనంతరం రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామన్నారు. వచ్చే వారం మండలంలో చేపట్టనున్న కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సీబీ తులసిరెడ్డి, పులిరాజు, తిరుమలేష్, నరసింహుడు, ఎస్‌ఎం బాషా, మల్లికార్జున, భానుప్రకాష్ రెడ్డి, లచ్చప్ప, దస్తగిరి, శంకర్‌రెడ్డి, బొజ్జన్న, రవిప్రకాష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

సి.బెళగల్: హాస్టల్ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని హెల్త్ ఎడ్యుకేటర్ (హెచ్‌ఈ) పుష్పావతి అన్నారు. శనివారం సి.బెళగ ల్‌లోని బీసీ, ఎస్సీ హాస్టల్‌ను ఆమె సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. హాస్టల్ పరిసరాలు,వంట గదులను పరిశీలించి సిబ్బందికి ప లు సూచనలు చేశారు. అదే విధంగా 72 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు, 25 మందికి రక్త పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఏఎన్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలతో బుద్ధి వికాసం



ఉప్పలపాడులో గోపూజ చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు: మానవుడికి దేహ వికాసంతో పాటు, బుద్ధి వికాసానికి ఆధ్యాత్మిక గ్రంథాలు దోహద పడుతాయని టీటీడీ దేవస్థానముల హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మహర్షులు అందించిన గ్రంథాలను అధ్యయనం చేయడం వల్ల రుషుల రుణం కొంతైనా తీర్చుకున్న వారమవుతామన్నారు. ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు పండితురాలు గురుదాద్రి వనజ కుమారి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు ఆవుల నాగన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు అయ్యస్వామి, సేవకులు అయ్యన్న, లలితమ్మ, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

అందుబాటు ధరల్లో సోలార్ పరికరాలు



నెడ్ క్యాప్ సోలార్ ప్యానెళ్లపై వివరిస్తున్న జేసీ నీరజ

కర్నూలు(సెంట్రల్): జీఎస్టీ తగ్గడంతో తక్కువ ధరకే సోలార్ పరికరాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు కమర్షియల్ ట్యాక్స్ శాఖ జాయింట్ కమిషనర్ నీరజ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని నెడ్ క్యాప్ ఆవరణలో సోలార్ ఉత్పత్తులకు సంబంధించిన ధరలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జీఎస్టీ 2.0 సంస్కరణలతో గృహ సోలార్, రూఫ్‌టాప్, పీఎం కుసుం పథకాలకు సంబంధించి ఆరు నుంచి ఏడు వేల వరకు ధరలు తగ్గినట్లు చెప్పారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ అధికారులు వీరేంద్రబాబు, పవన్‌కుమార్, మంత్రాలయం ఈటీపీఆర్‌డీ ఉపేంద్ర, ఎమ్మిగనూరు ఎస్‌పీడీసీఎల్ నాగేంద్ర ప్రసాదు పాల్గొన్నారు. జీఎస్టీ సంస్కరణలతో వాహనాల ధరలు బాగా తగ్గాయని డీటీసీ శాంతకుమారి పేర్కొన్నారు. నగరంలోని ద్విచక్రవాహనాల షోరూమ్‌ల్లో పనిచేసే సిబ్బందితో కలెక్టరేట్ వరకు స్కూటర్ల ర్యాలీని చేపట్టించారు. ఈ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు.

సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించండి

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ తన చాంబరులో సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..వసతి గృహాల విద్యార్థులకు పౌష్టికాహారం, సరైన గదులు, బాత్ రూమ్‌లు, టాయిలెట్‌లతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. అవసరమైన అదనపు గదులు, టాయిలెట్ల నిర్మాణాలు, మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వసతి గృహాల మరమ్మతులు, నిర్మాణాలకు సంబంధించి సొంత శాఖల ద్వారానే కాకుండా సీఎస్‌ఆర్ ఫండ్స్, ఎంపీలాడ్స్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ రాధిక, బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, కోఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

డిసెంబరులోపు లక్ష్యాలు పూర్తి చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖ లక్ష్యాలను ఈ ఏడాది డిసెంబరులోపు పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి రాజాకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఉద్యాన అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...2026 జనవరి నుంచి ఎప్పుడైన స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఆలోపే మన లక్ష్యాలను పూర్తి చేసుకోవడంపై దృష్టి సారించాలన్నారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవైపై స్కీమ్‌లకు సంబంధించి వివిధ కాంపోనెంట్ల కింద లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. పండ్లతోటలకు అవకాశం ఎక్కడ ఉందో గుర్తించి లబ్ధిదారుల ఎంపికలో ఆ ప్రాంతాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సత్వరం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి గ్రౌండింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఉల్లి పంట పొలం మీద కనీసం 120 రోజులు ఉండాలని, ముందస్తుగా కోస్తుండటం వల్ల నాణ్యత కోల్పోవడం వల్ల ధరలు లభించడం లేదన్నారు. ఈ ఏడాది 500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు167 హెక్టార్లలో సాగు అయిందని తెలిపారు. సమావేశంలో సాంకేతిక ఉద్యానఅధికారి అనూష, ఉద్యాన అధికారులు శ్రీవాణి, మదన్‌మోహన్‌గౌడు, నరేష్, అపర్ణ, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి సేవలు మరువలేనివి



శ్రీనివాసరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం : రెవెన్యూశాఖలో పని చేస్తూ అందరి మన్ననలు పొందిన సీనియర్ అసిస్టెంట్ కాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి సేవలు మరువలేనివని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శనివారం తొగర్చేడు గ్రామంలోని మృతుడి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను, సోదరుడు కాచిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డిని పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, జిల్లా పంచాయరాజ్ అధ్యక్షుడు రామలక్ష్మయ్య, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జాకీర్, రమణయ్య, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు నాయకులు, ప్రజలు ఉన్నారు.

రెవెన్యూ సిబ్బంది నివాళి

కాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి మృతి భౌతికయంపై తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తహసీల్దార్ ఆార్యాలయ, నంద్యాల డివిజన్ కార్యాలయంలో పని చేసే సిబ్బంది నివాళులర్పించారు.

లోపించిన పారిశుద్ధ్యం



పెద్దపాడులో రోడ్డు పక్కన ఉన్న చెత్తను చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడులో పారిశుద్ధ్యం లోపించిందని సీపీఎం నాయకులు గోపినాథ్, నాగరాజు అన్నారు. శనివారం పెద్దపాడు గ్రామంలోని వివిధ ప్రాంతాలలో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఇంటిపక్కల మురికివాడని తలపిస్తోందన్నారు. చెత్తా చెద్దారం రోడ్డుపై వేయడం వల్ల డంపింగ్ యార్డుగా మారిందన్నారు. కొన్ని కాలనీలో మ్యాన్‌హోల్స్ తెరచుకోవడం వల్ల పిల్లలు, వృద్ధులు కింద పడి గాయాలకు గురవుతున్నారన్నారు. పెద్దపాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో యేసురాజు, పరశురాముడు, చిరంజీవి, కృష్ణ, దినేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించి, వారి విద్యాభివృద్ధి కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నాగలక్ష్మి అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సమావేశాల్లో చర్చించే అంశాలు విద్యార్థుల పురోగతికి దోహదపడేలా ఉండాలని సూచించారు. ఇక మండలంలోని కంబదహాల్, కొత్తకోట, బురాన్‌దొడ్డి, పోలకల్, మారందొడ్డి, గుండ్రేవుల జెడ్పీ హైస్కూళ్లలో కూడా హెచ్‌ఎంల ఆధ్వర్యంలో కాంప్లెక్స్ సమావేశాలు జరిగి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



సి.బెళగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సి.బెళగల్ పంచాయతీ కార్యదర్శి శ్యామలమ్మ అన్నారు. శనివారం సి.బెళగల్‌లో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే పారిశుద్ధ్యం లోపించి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ఆనందాల దీపావళి

- టపాసుల విషయంలో అజాగ్రత్త వద్దు
- నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు
- ప్రజలకు అధికారుల సూచనలు



ఓ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న టపాసులు

గడివేముల: చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే దీపావళి పండగ రానే వచ్చింది. అందరూ కొత్త దుస్తులు ధరించి, బాణసంచా కాలుస్తూ ఆనంద డోలికల్లోలాడుతారు. అయితే ఆ వెలుగుల మాటున ప్రమాదం పొంచి ఉంటుందని, అందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఆనంద దీపావళి అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్టేనని, బాణసంచా కాల్చే సమయంలో తప్పని సరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు అధికంగా ఉంటాయి. అటువంటి ప్రాంతాల్లో రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటివి కాల్చరాదు.
- పండగ ఆనందంలో పిల్లల పట్ల ఏమాత్రం అజాగ్రత్త వహించినా జీవిత కాలం ఇబ్బంది పడాల్సి వస్తుంది.
- టపాకాయల పనితీరు, వెలిగించాల్సిన విధానం తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యేలా తెలపాలి. సాధ్యమైనంత వరకూ పెద్దల పర్యవేక్షణలో టపాసులు కాల్పించాలి.
- కొంతమంది కొన్నిరకాల టపాసులను రోడ్లపై పేల్చేందుకు ప్రయత్నిస్తారు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇరుకు ప్రాంతాల్లో ఉండే సీసీ రోడ్లలో ఈ విధమైన ప్రమాదాలు అధికంగా జరిగే వీలుంటుంది. అందుచేత వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యేలా రహదారులపై టపాసులను వెలిగించరాదు.

వ్యాపారులు పాటించాల్సిన నియమాలు

- జన సంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేయాలి.
- అనుకోని ప్రమాదాలు తలెత్తినపుడు వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా విశాలమైన మార్గం ఉంటే మంటలను త్వరగా అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బందికి అనువుగా ఉంటుంది.
- టపాకాయలు విక్రయించే వ్యాపారులు మొదటగా పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాలి.
- విక్రయ ప్రాంతంలో విధిగా ఇసుక, నీరు, కార్బన్ డయాక్సైడ్ వాయువును అందుబాటులో ఉంచుకోవాలి.
- దుకాణాల సమీపంలో ఎవరూ సిగిరెట్లు, బీడీలు కాల్చకుండా పొగ తాగరాదు అని బోర్డులను ఏర్పాటు చేయాలి.
- సెల్‌ఫోన్‌లో మాట్లడకుండా చర్యలు తీసుకోవాలి. దుకాణల మధ్య కనీసం పది అడుగుల దూరం ఉండేలా చూడాలి.
- మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రాల్లో విద్యుత్ సంబంధించిన వైరింగు సక్రమంగా ఉండేలా జాగ్రత్త వహించడంతో పాటు సాధ్యమైనంత వరకూ ఎల్‌ఈడీ బల్బులు వాడడం మంచిది.
- తనిఖీలు నిర్వహించే సమయంలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక పంచాయతీ అధికారులకు నిల్వల వివరాలను తెలిపేందుకు సహకరించాలి.
- ప్రతి దుకాణం ఎదుట టపాకాయల ధరల పట్టిక, అగ్ని మాపక కేంద్రాల ఫోన్ నంబర్లు తప్పకుండా ఏర్పాటు చేయాలి.

అనుమతులు తప్పనిసరి



టపాకాయలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవు. విక్రయ కేంద్రాల వద్ద తప్పనిసరిగా ఇసుక, నీరు, అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు.

– వెంకటరమణ, తహసీల్దార్, గడివేముల

అప్రమత్తంగా ఉండాలి



ప్రమాదాలనేవి ప్రారంభంలో చిన్నవిగానే ఉంటాయి. అనుమానం ఉంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. టపాసులు విక్రయించే వ్యాపారులు అధికారుల నిబంధల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. టపాసులను విక్రయదారులు జనసంచారం, ప్రజల నివాసం ఉన్న ప్రదేశాల్లో విక్రయించకుండా ప్రభుత్వాధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే.. నిబంధల మేరకు ఏర్పాటు చేయాలి. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి లేదా 108 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా టపాసులు విక్రయిస్తే 112కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి.

– నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ, గడివేముల

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

కల్లూరు: కర్నూలు నగరం సి. క్యాంపులోని బైక్ షోరూం ఆధ్వర్యంలో శనివారం సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీడీఓ నాగశేషాలచరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లబ్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సాక్షి దినపత్రిక, ఎడిటర్‌పై వేధింపులు, కేసులను నిరసిస్తూ ఓర్వకల్లులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న పాత్రికేయులు